10. 9. 2000

కథ

# మొదటి పని గంటవేళ



వాడ్రేవు చినవీరభద్రుడు

సాధారణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో పొద్దుటిపూట ప్రశాంతంగా వుండే మొదటి పనిగంటవేళ. అతనిపేరు కనక సుందరం. లేదంటే కనకాంబరం ఏదన్నా ప్రస్తుతానికి క అనుకుందాం. అతను పనిచేస్తున్న కార్యాలయం ప్రజా పరిపాలనకు చెందిన అత్యవసర సర్వీసుల్లో ఒకటి. అది కరెంటు బిల్లులు కట్టించుకునే ఆఫీసు, లేదంటే రవాణా సాధనాల్ని రిజిష్టరు చేసే ఆఫీసు, రేషన్ కార్డులు ఇచ్చేది, ఏదయినా కావచ్చు. ఆ ఆఫీసు ప్రజల సమస్యల్లో ప్రత్యేకం దేని గురించి అన్నది మనకి ఆట్టే అవసరంలేదు.

ఆ మాటకొస్తే రాష్ట్ర ప్రభుత్వ ఆఫీసులు ఏవయినా ఒక్కలానే ఉంటాయి. ఆ బల్లలు, కుర్చీలు, పేపరు వెయిట్లు, నల్లగా మసిబారిన గుండుసూదులు గుచ్చుకునే కుషన్ గిన్నెలు, ఆ ఇంకుమరకలు, కిళ్ళీ ఉమ్ములు, దుర్గంధ భూయిష్టమైన మూత్రశాలలు, కాని అన్ని కార్యాలయాల్లోలానే అక్కడకూడా పదకొండు గంటల నుంచీ సాయంకాలం దాకా ప్రజలు మూగుతుంటారు. వాళ్ళెందుకు అక్కడకు చేరతారో ఎవరికీ అర్థంకాదు, వాళ్ళతో ఎవరన్నా మాట్లాడతారో లేదో, అసలు వాళ్ళ సమస్య ఏదో ఎవరన్నా అడుగుతారోలేదో, వాళ్ళలో కొంతమంది ప్రతిరోజూ అక్కడ హాజరవుతుంటారు. తెలీని వాళ్ళకి వాళ్ళలో ఎవరు బయటవారో, ఎవరు ఆఫీసు సిబ్బందో ఎంచడం సాధ్యంకాదు.

ఇంతకీ కనకసుందరం లేదంటే కరుణాకరం, ఏదన్నాగానీ క- దగ్గరకు వద్దాం. అతను ఆఫీసుకి రాగానే కుర్చీలో కూచుంటూ అలవాటుగా టేబిలు సొరుగులాగి అసంకల్పితంగానే సొరుగులో వున్న కాగితాలవేపు చూస్తూనే అతని మొహం నల్లబడి పోయింది. అక్కడే ఆ కాగితాలపైనే ఉందది. తేలుకాదు, పాముకాదు, కాని అంతకన్నా భయం పుట్టించే ఆ పోస్టు కార్డు. దాన్ని చూడగానే అతని వెన్ను చివర ఒణుకు పుట్టింది. నూతిలో చిరకాలంగా వుంటున్న కప్పని ఒక్కసారిగా నుయ్యి ఎండిపోవడం అన్న ఆలోచన భయపెట్టినట్టు ఉంటుంది ఆ ఒణుకు. అతనా పోస్టుకార్డ్‌ని ఒద్దనుకుంటూనే ముట్టుకున్నాడు. (అప్పటికి కనీసం ఒక వందమార్లయినా చేసినట్టే) చూడకూడదనుకుంటూనే మళ్ళా చూసాడు. అది అక్కడ లేదని తనని తను నమ్మించుకోవాలని ఇంత దాకా ప్రయత్నిస్తున్నట్టే ఇప్పుడు కూడా నమ్మించుకోబోయాడు. కానీ అన్ని భయానక యధార్థాల్లానే అదికూడా ఒక యధార్థం, కానీ ఆ యధార్థాన్ని ఎదుర్కోవడం ఎలానో నిన్నటిదాకా సాధ్యంకానట్టే ఈరోజు కూడా సాధ్యం కాలేదు అతనికి.

ఆ పోస్టుకార్డుని సొరుగులోనే వుంచి నెమ్మదిగా సొరుగు మూసేడు. జాగ్రత్తగా తాళం వేసాడు. మంత్రగాడు సీసాలో దెయ్యాన్ని బంధిస్తున్నప్పుడు ఎంత జాగ్రత్తని కన్పరుస్తాడో అంత జాగ్రత్తగా. ఆ తర్వాత ఒక్క క్షణం కుర్చీలో నిస్సత్తువగా, నిశ్శబ్దంగా కూర్చున్నాడు. అప్పుడు బయటకి లేచాడు. చుట్టూ పనిలోకి సర్దుకుంటున్న ఆఫీసు హడావిడి అతనికి పట్టలేదు. బయట జనం ఒక్కొక్కరే చేరుతుంటే తెరమీద నీడల్లాగా ఉన్నారు. ఆ నీడల మధ్య నుంచి, ఆ చారల మధ్యనుంచి ఆఫీసు బాల్కనీ దాకా వెళ్ళాడు. దూరంగా కనిపించే మేరదాకా తన చూపులు సారించాడు. కానీ కనబడ్డవేవీ అతని గ్రహింపుకి రావడంలేదు.

మన కనక సుందరం, లేదంటే కోదండరామం ఏదన్నా ఇప్పటిదాకా అనుకుంటున్నట్టే క అనుకుందాం, అతను ఈ మహా ప్రభుత్వ యంత్రాంగాన్ని తామే నడుపుతున్నట్లు విశ్వసించే కోవకి చెందినవాడే. చిన్న వయసులోనే ప్రజల వ్యవహారాల్ని ప్రజల క్షేమం కోరుతున్నట్లుగా ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగా విప్పి, వంచి, విరిచి, మలిచి, మార్చి రాయడంలో అతను సాధించిన ప్రావీణ్యం అతని సహోద్యోగుల్నీ, పై అధికారుల్నీ కూడా విభ్రాంతపరిచేది. ఎంత క్లిష్టమయిన సమస్య మీదనన్నా అతను కార్యాలయం కోసం ఒక నోట్ డ్రాఫ్ట్ చేసి సమర్పించాడంటే దానికి తిరుగులేదు. అతను ఏమిరాస్తే అది (టైపిస్టు టైపు తప్పులతో సహా) అతను ఎడమపక్క పొట్టి సంతకంతో పైకి పంపించాడంటే ఇంక కుడిపక్క ఎన్ని సంతకాల వరకయినా ఎన్ని టేబుల్స్ మీదనుంచయినా అది సుదర్శన చక్రంలాగా అడ్డులేకుండా పోయి రావల్సిందే. అప్పుడప్పుడు అతను తమా షాకి ఏవన్నా అబ్జెక్షన్లు లేదా సందేహాలు లేవనెత్తి వాటికి క్లారిఫికేషన్లు ప్రభుత్వం నుంచి రాబట్టడానికి ప్రయత్నించాడా ఆ ప్రశ్నలు ఎంతదూరం ప్రయాణించినా వాటికి సమాధానాలు చెప్పగలిగినవాళ్ళెవరూ వుండటం అసాధ్యం. తిరిగి పై అధికారి ఆ సమస్యలకి పరిష్కారం కోసం క.ని ప్రాధేయపడాల్సిందే. అసంఖ్యాకమయిన మనుషులు, శరీరాలు, శ్రమ, ఇచ్చిపుచ్చుకోవడాలు, లావాదేవీలు వుంటే ప్రజాజీవితాన్ని ప్రభావితంచేసే సర్క్యులర్లు, ఆర్డర్లు, మెమోలు, షాక్స్‌లు, జనజీవనాన్ని అతలాకుతలంచేసే జీవోలు, యాక్టులు, సవరణలు, తీర్పులు- వీటన్నిటికీ ఆధార స్థంభం క. ఆ భావన నీకెంత తృప్తి కలిగిస్తుందని. క ఉన్నందువల్లనే సిటీబస్సులు నడుస్తాయి. క వల్లనే మెట్రోపాలిటన్ వాటర్ పైపుల్లో నీళ్ళు ప్రవహిస్తాయి. క వల్లనే నెలకు ఒకసారి ఆఫీసు కార్యాలయాల్లో ఫైళ్ళనీ దుమ్ము దులుపుతారు. క కోసమే లలిత కళాతోరణంలో నటసార్వభౌముడి పాత



1

సినిమాలు ఉచితంగా ప్రదర్శిస్తారు.


జీవితం ఇంత సౌకర్యవంతంగా ఉన్నవేళ, ఆకాశం మీదపడకుండా, భూమి కుంగిపోకుండా వున్నవేళ, నీ ఎడ్రస్‌కు నీ మిత్రుడెవరో రాసిన ఉత్తరం పోస్టుమాన్ నీ ఎడ్రస్‌కే తప్పకుండా అందిస్తున్న వేళ- అప్పుడొచ్చింది ఆ పోస్టుకార్డు, దోరగల్లిన కాయ పండబోతున్నపుడు ఎక్కడినుంచో ప్రవేశించిన సూక్ష్మక్రిమిలా.

ఇంతకీ అది బెదిరింపు ఉత్తరం కాదు, అప్పుల వాళ్ళు గుర్తుచేసిన బకాయి తాఖీదు కాదు, కోర్టు సమను కాదు, పిల్లవాడు మనియార్డరు కోసం రాసింది కాదు, కూతురికి వచ్చిన ప్రేమ లేఖ కాదు. మీకు చెప్తే ఆశ్చర్యం కలుగుతుంది. మీరు నమ్మలేరు, నవ్వేస్తారేమో కూడా, ఇంతకీ అదొక ప్రజాఫిర్యాదు. ప్రభుత్వ భాషలో దాన్ని గ్రివెన్స్ అంటారు. ఎవరో ఎక్కడో ప్రభుత్వం వల్ల తనకు న్యాయం జరగలేదనో, అన్యాయం జరిగిందనో, అన్యాయం జరగకూడదనో అమాయకంగానో, ఆగ్రహంతోనో చేసిన విజ్ఞప్తి. దాన్ని అంగీకరించు, అంగీకరించకపో, చివరకి తిరస్కరించు, కాని ముందు దాన్ని పరిశీలించాలి. ఆ పరిశీలించడం కోసమే ప్రభుత్వం వుంది, యంత్రాంగం వుంది, చట్టసభ వుంది. బడ్జెటు వుంది. క. ఉన్నది అందుకే. క సామర్థ్యం కూడా అక్కడే.

కానీ ఈ పోస్టుకార్డుతోనే వచ్చిపడింది చిక్కు. ఏమంటే అందులో సమస్య ఏమిటో స్పష్టంగా లేదు. అసలు ఆ భాష ఏమిటో కూడా అర్థం కావడం లేదు. ఆ ఎడ్రస్ కూడా తన కార్యాలయానిదే అన్న హామీలేదు. పోస్టుమాన్ ఆ కార్డు ఈ ఆఫీసులోనే ఎందుకిచ్చాడో. బహుశా అతనికి తెలిసివుంటుందా, లేక తెలియకుండా ఇచ్చాడా లేదా పొరపాటా, లేకుంటే ఎక్కడా బట్వాడా కాని ఉత్తరాన్ని ఈ ఆఫీసులో గడుసుగా దిగవిడిచి వెళ్ళిపోయాడా? విచిత్రమేమిటంటే ఆ కార్డు అందింతర్వాత ఆఫీసు డిస్పేచి గుమాస్తా ఆఫీసు సీలు ముద్ర కొట్టాడు. ఆ కార్డు మీద ప్రముఖంగా వున్నది ఆఫీసు ముద్రనే. అప్పుడు దాన్ని తపాల ఫైలులో పెట్టి ఆఫీసరుకు పంపాడు. ఆయన దాన్ని చూసి దాని మీద ఆకుపచ్చ ఇంకుతో ఎండార్సుమెంటు రాసేడు. సమస్య అంతా ఎక్కడొచ్చిందంటే ఆ ఎండార్సుమెంటు ఆఫీసరుదే అని చెప్పవచ్చుగాని అందులో ఆయన ఏం రాసాడో అర్థం కావడంలా. ఇంతకీ ఆయనకి ఆ ఫిర్యాదు స్వరూప స్వభావాలు అర్థమయినట్టా, కానట్టా. దాన్ని ఆయన పరిష్కరించగలమనుకుంటున్నాడా, లేమనుకుంటున్నాడా? ఇంతకీ ఆయన ఆ ఫిర్యాదును పరిశీలన కోసం ఎడ్మిట్ చేసినట్టా, చేయనట్టా? లేదంటే ఆయన కూడా పోస్టుమన్ లాగా గడుసుగా వ్యవహరిస్తున్నాడా? ప్రభుత్వ కార్యాలయాల్లో ఆఫీసరు, అసిస్టెంటు మాట్లాడుకోరు. వాళ్ళ అంతరంగాలు అంత తేలిగ్గా బయటపడవు. వాళ్ళు నోటింగ్సు ద్వారా, ఫైళ్ళద్వారా మాట్లాడుకుంటారు. ఆఫీసరు ఎంత పెద్ద రాజయితే ఆయన అంతరంగం అంత నిగూఢంగా వుంటుంది. కాబట్టి క. తన ఆఫీసరుని ఈ కార్డు గురించి ప్రశ్నించే ప్రసక్తిలేదు. ఒకవేళ సాహసం చేద్దామనుకున్నా ఇప్పటికే ఎంతో ఆలస్యమయిపోయింది. ఇప్పుడు ఇంతదాకా జరిగిన ఆలస్యం మరొక అదనపు తప్పిదం. ఒకవేళ ఆఫీసరు ఆ కార్డును రొటీన్‌లో చూసి మర్చిపోయి వుండవచ్చుకదా. పోనీ అలాగని మౌనం వహించుదామా అంటే రేపు ఎవరో ఒక పౌరుడు తన కుళాయి లేదా కరెంటు మీటరు లేదా ఇంటిపన్ను రశీదు లేదా రేషను కార్డు లేదా పుట్టినతేదీ ధృవపత్రం నకలు ఏదో మరేదో పోయిందనో, దొరకలేదనో, ఇది తను ఇంతకుముందే పోస్టుకార్డు ద్వారా ఆఫీసు దృష్టికి తెచ్చినా పట్టించుకోలేదని ఫిర్యాదు చేస్తే, ఆ పోస్టు కార్డు ఇదే అయితే?

ఆ కార్డుని చింపెయ్యడంగానీ, బుట్ట దాఖలా చెయ్యడం గానీ సాధ్యంకానే కాదు. ఎందుకంటే మంచికో చెడ్డకో ఆఫీసు దానికో నంబరు ఇచ్చింది, చూసుకోకుండా క. దాన్ని ఎక్నాలెడ్జ్ చేసాడు. దాన్ని తన పర్సనల్ రిజిష్టరులో కూడా ఎక్కించాడు. ప్రతినెలా ప్రభుత్వానికి సమర్పించే పెండింగు కాగితాల లెక్కల్లో ఆ కార్డు కూడా చేరింది. ఇప్పుడు దాన్ని ధ్వంసం చెయ్యడం కష్టం. ఇంతకన్నా ఒక హత్య చెయ్యడం లేదంటే ఆత్మహత్య చేసుకోవడం సులభం.

కనకసుందరం లేదంటే కిరీటి ధనుంజయం ఏదన్నా ఇప్పటిదాకా మనం అతన్ని క. అంటున్నాం కాబట్టి అతనికి మరొక ఆలోచన కూడా వచ్చింది, ఇంతకీ ఆఫీసరు దాన్ని తనకే



**తగలబడ్డ ప్రభుత్వ రికార్డులన్నిటితో ఆ పోస్టు కార్డు కూడా ఉండి వుండాలికదా. అప్పుడు క.కి స్వతంత్రం వచ్చినంత సంతోషం కలిగిందట. ఆ అజ్ఞాత ఫిర్యాదీదారు ఇంక అతన్ని బయటపెట్టలేదు. భయపెట్టలేదు. ఆ నక్సలైట్లు ఎంత ఉదారులు అనుకోకుండా ఉండలేకపోయాడు**

ఎండార్సు చేసినట్టు ఏమిటి గుర్తు? దానిమీద ఆయన వేసిన గుమాస్తా నంబరు అలుక్కుపోయినట్టుగా వుంది. దాన్ని డిస్పాచ్ క్లర్కు తనకే ఎందుకు ఇచ్చినట్టు? ఇది పోస్టుమాన్, ఆఫీసరు, డిస్పాచి క్లర్కు కలిసి పన్నిన వ్యూహమా? ఆడుతున్న ఆటా? వేసుకున్న జోకా లేదంటే కలిసి చేస్తున్న కుట్రనా? ఒకవేళ తను దీనిలో వున్న సమస్యని అందరిముందూ పెట్టినా, ఇది తనకే ఎండార్సు కాలేదని రుజువు చేసినా 'ఇది నువ్వు సమర్థుడవి కాబట్టి నీకే అప్పగించాం' అంటే? అప్పుడు మాత్రం ఈ ఫిర్యాదు నుంచి తను ఎలా తప్పుకోగలడు? తన సామర్థ్యం మీదనే కొండంత నమ్మకం పెట్టుకున్న తన కార్యాలయాన్ని ఎలా తప్పించుకోగలడు? పోనీ ఆఫీసులో అందరూ కూడబలుక్కుని ఈ కాగితాన్ని డెస్ట్రాయ్ చేద్దామనుకున్నా, ఇది పెండింగు కాగితాల లెఖ్ఖల్లో ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయానికి రిపోర్టు అయిపోయింది. ఈ ఫిర్యాదీ ఎవరో ఇటువంటి లేఖనే ముఖ్యమంత్రి కార్యాలయానికి కూడా ఇచ్చివుండరని ఏమిటి నమ్మకం? పోనీ ఇవ్వకపోయినా ఇప్పటికి కొన్నాళ్ళు నిశ్శబ్దంగా వుండి అప్పుడు మళ్ళా గొడవచేస్తే? పోనీ ఈ సంగతి ఆఫీసరు తమ హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంట్‌తో ఉన్నదున్నట్టు చెప్పేస్తే, ఆయన దాన్ని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చెప్పేస్తే, దాన్ని కేబినెట్‌కి నివేదించి, కౌన్సిల్ రిజల్యూషన్ ద్వారా దాన్ని డెస్ట్రాయి చెయ్యగలమా? అది కూడా సాధ్యంకాదు, ఎందుకంటే ముఖ్యమంత్రిగారు పెండింగు కాగితాల లెక్కని ప్రజలకు తెలిసేలా నెలనెలా పేపరు ప్రకటనలు ఇస్తున్నాడు. ఆ ఫిర్యాదీ ఎవరో ఈ లెక్కలు జాగ్రత్తగా గుర్తుపెట్టుకొని కోర్టు ముందు కేసు వేస్తే? లేదంటే ఇదంతా పేపర్‌లో చదివి ఎవరన్న ప్రజాప్రయోజనం కోసం లిటిగేషన్ ప్రారంభిస్తే? లేదంటే అంతా చివరకు క. దగ్గరకే వచ్చి 'గతంలో చేసినట్టే నువ్వే ఈ సమస్య నుంచి మమ్మల్ని ఎలాగో ఒకలాగా బయట పడెయ్యి, అందుకే నువ్వే సమర్థుడివి' అంటే! తను తననీ తన కార్యాలయాన్నీ, తన డిపార్టుమెంట్‌నీ, తన ప్రభుత్వాన్నీ చివరకు తన ముఖ్యమంత్రినీ ఎలా రక్షించుకోగలడు?

**2**

ఈ కథ ఇలా తెగేదికాదుగానీ, కనకసుందరం, లేదంటే కమలాకరం ఏమన్నాగానీ మనందరికీ పరిచయమయిన క.కి ఒక కల వచ్చిందిట. ఆ కలలో నక్సలైట్లు తన కార్యాలయాన్ని తగలబెట్టేసారుట. అందరూ గోలగోల చేస్తుంటే కనక సుందరం కూడా కలలో గగ్గోలు చెయ్యబోయాడంట. ఇంతలో అతనికి గుర్తొచ్చిందట. తగలబడ్డ ప్రభుత్వ రికార్డులన్నిటితో ఆ పోస్టు కార్డు కూడా ఉండి వుండాలికదా. అప్పుడు క.కి స్వతంత్రం వచ్చినంత సంతోషం కలిగిందట. ఆ అజ్ఞాత ఫిర్యాదీదారు ఇంక అతన్ని బయటపెట్టలేదు. భయపెట్టలేదు. ఆ నక్సలైట్లు ఎంత ఉదారులు అనుకోకుండా ఉండలేకపోయాడు. తను చెయ్యలేకపోయిన పని వాళ్ళు చేసేసారు. ఇప్పుడు తన ఆఫీసుకీ, డిపార్టుమెంటుకీ, ప్రభుత్వానికీ, చివరకి ముఖ్యమంత్రికీ కూడా ఎంత పెద్ద సమస్య తప్పింది!

**3**

కానీ తెల్లవారగానే సమస్య మళ్ళీ మొదలు. ఇంతకీ జరిగింది అతని కలలోగానీ బయటకాదుకదా. ప్రభుత్వ కార్యాలయాల్లో పొద్దుటిపూట మొదటి పనిగంటవేళ చాలా ప్రశాంతంగా వుంటుంది. ప్రతి ప్రభుత్వోద్యోగీ తన పని మనసుపెట్టి చెయ్యగలిగే టైం అప్పుడే అనుకుంటాడు. కాని క. మనశ్శాంతి పోవడానికి మొదలూ అప్పుడే.

## పెన్సిల్ ఎలా పుట్టింది?

పెన్సిల్ అనే పదం 'పెనిసిలస్' అనే లాటిన్ పదం నుంచి పుట్టింది. ఈ మాటకు చిన్నతోక అని అర్థం. ప్రాచీన గ్రీకులు, రోమన్లు పెపైరస్ కాగితంపై రాయటానికి సీసపు ముక్కల్ని వాడేవారు. కొయ్య పెన్సిల్స్ పదహారో శతాబ్దంలో యూరప్‌లో తయారుచేశారు. గ్రాఫైట్ అనే బొగ్గు సంబంధమైన నల్లటి పదార్థాన్ని ఉపయోగించి కె.డబ్ల్యు.స్కిల్ (జర్మన్) 1779లో మేలైన పెన్సిల్ తయారుచేశాడు. అదే తర్వాత కాలంలో దేశదేశాలలో ప్రాచుర్యం పొందింది. ఇవాళ 350 రకాలకు పైగా పెన్సిళ్ళు ఉన్నాయి. నిమిషానికి రెండువేల పెన్సిళ్ళు తయారవుతాయి.